సాక్షి నిజామాబాద్

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



నిర్మల హృదయ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

క్రిస్మస్ వేడుకలు షురూ



నగరంలోని సీఎస్ఐ చర్చిలో..

ప్రేమ, కరుణామయుడైన యేసుక్రీస్తు జన్మదినం క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. చర్చీలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేకులు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ, నిర్మల హృదయ తదితర చర్చిల్లో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.



క్రీస్తు వాక్యం బోధిస్తున్న పారిస్ ప్రీస్ట్ మదను జోసెఫ్



క్రిస్మస్ వేడుకల కోసం నిర్మల హృదయ చర్చిలో ప్రత్యేక అలంకరణ

పాతుకుపోయారు..

- రూ.417 కోట్ల విలువైన బియ్యం ఇవ్వకుండా తాత్సారం
- సంఘం నాయకుల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పలువురు మిల్లర్లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కస్టమ్ మిల్లింగ్ రైస్ ప్రభుత్వానికి ఇచ్చే విషయంలో జిల్లాలోని పలువురు మిల్లర్లు లెక్కలేకుండా వ్యవహరిస్తున్నారు. మిల్లర్స్ అసోసియేషన్ సైతం ఇందుకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మిల్లర్స్ అసోసియేషన్ పదవుల్లో వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలో ఉన్న నాయకులు ఏళ్లతరబడి పాతుకుపోయి భ్రష్టుపట్టించి, అక్రమాలకు సహకరిస్తున్నారని మరికొందరు మిల్లర్లు గుర్రుగా ఉన్నారు. ప్రశ్నించిన కొందరు మిల్లర్ల మీద పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారుల ద్వారా దాడులు చేయిస్తూ బెదిరింపులకు గురిచేసినట్లు బహిరంగ చర్చ నడుస్తోంది. ఇక పదవుల్లో పాతుకుపోయిన నాయకుల ఏకపక్ష వ్యవహారశైలిని చూసి విసుగెత్తిన కొందరు మిల్లర్లు 15 నెలల క్రితం వేరుకుంపటి పెట్టుకున్నారు. గత 15 ఏళ్ల కాలంలో మిల్లర్లు జమ చేసిన ఫండ్ విషయమై కనీసం లెక్కలు చెప్పకుండా తమను ప్రశ్నించడమేమిటంటూ గొడవలు పెట్టుకున్నట్లు కొందరు మిల్లర్లు వాపోతున్నారు. అయిన ఖర్చులకు 10 రెట్లు అదనంగా వసూలు చేసి సదరు పాతుకుపోయిన నాయకులు తమ జేబులు నింపుకున్నారని చెబుతున్నారు. అసోసియేషన్ పదవుల్లో పాతుకుపోయిన వాళ్ల అండ చూసుకుని జిల్లాలో పలువురు మిల్లర్లు ప్రభుత్వానికి పంగనామాలు పెడుతున్నట్లు తెలిపారు.

నోటీసులకే పరిమితమవుతున్న అధికారులు

రైస్‌మిల్ అసోసియేషన్ నాయకులు ఏళ్లతరబడి ఇష్టం వచ్చినట్లు చేస్తుండడంతో వీరిని ఆదర్శంగా తీసుకున్న పలువురు మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇచ్చే విషయంలో ప్రభుత్వానికి పంగనామాలు పెడుతున్నారు. గత మూడేళ్ల కాలంలో 41 మంది మిల్లర్లు రూ.417 కోట్ల మేర విలువ చేసే సీఎంఆర్ ఇవ్వకుండా మోసపూరితంగా వ్యవహరిస్తున్నప్పటికీ అధికారులు రెవెన్యూ రికవరీ నోటీసులు ఇస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఈ క్రమంలో సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు తీసుకున్న భారత వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్‌లు ఢిల్లీలో కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో వినియోగదారుల మండలి సమావేశాల్లో పాల్గొన్న వీరు పూర్తి వివరాలతో ఫిర్యాదులు చేశారు. ఇదిలా ఉండగా నెలరోజుల క్రితం సాలూర వద్ద ఓ మిల్లర్ 10 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని వచ్చిన వెంటనే ప్రైవేటు మార్కెట్‌లో అమ్ముకున్నాడు. దీనిపైనా అధికారులు తమకేం తెలియనట్లు వ్యవహరిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అధికారులు మామూళ్ల మత్తులో నిద్ర నటిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు పాతుకుపోయిన అసోసియేషన్ నాయకులకు తొత్తులుగా మారినట్లు తెలుస్తోంది. అసోసియేషన్ లెక్కల విషయమై ప్రశ్నించిన కొందరు మిల్లర్లను అధికారుల దాడుల ద్వారా బ్లాక్‌మెయిల్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టకుండా వదిలేస్తున్నారంటూ వినియోగదారుల మండలి బాధ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



పెర్కిట్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మెనూ ప్రకారం భోజన పదార్థాలు ఉన్నాయా? ప్రతి రోజూ కోడిగుడ్డు అందిస్తున్నారా? అని ఆరా తీశారు. విజయ వంటనూనె, విజయ డెయిరీ పాలను వినియోగించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

వేసవిలో నాణ్యమైన విద్యుత్

- కొత్తగా 286 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు.. 317 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు
- విద్యుత్ ఎస్ఈ రవీందర్



రవీందర్

సుభాష్‌నగర్: వేసవి కాలంలో డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించడంతోపాటు నిర్దిష్టమైన చర్యలు చేపడుతోంది. కొత్తగా మూడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 33/11 కేవీ సబ్ స్టేషన్లలోని ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఏడాది కాలంలో గరిష్ట డిమాండ్ ఉన్న సమయంలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్‌భారం ఎంతుందో టాంగ్ టెస్టర్ రీడింగ్ తీసుకుని అందుకనుగుణంగా కొత్తగా 286 ట్రాన్స్‌ఫార్మర్ల ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే 317 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్స్ వ్యవస్థను పటిష్టపర్చడం, ప్రతీ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన పనులు పూర్తి చేస్తున్నారు. నిజామాబాద్ కార్పొరేషన్‌తోపాటు మున్సిపాలిటీల్లో నిరంతర విద్యుత్ సరఫరా కోసం రింగ్ మెయిన్స్ వ్యవస్థ పటిష్ట పరుస్తున్నారు. అత్యవసర సర్వీసులైన ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, పోలీస్‌స్టేషన్లకు అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ చర్యల ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్) నిర్వహణ చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని తగ్గిస్తున్నామని, ఉద్యోగులు కంకణబద్ధులై పని చేస్తున్నారని ఎస్ఈ రవీందర్ అన్నారు.

28న చెరుకు రైతుల అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న టీపీసీసీ డెలిగేట్, మాజీ ఎంపీపీ బి గంగాశంకర్

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్(ఎన్‌డీఎస్ఎల్)ను పునఃప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 28వ తేదీన ఎడపల్లి మండల కేంద్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో చెరుకు రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. చెరుకు సాగును ప్రోత్సహించడంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారని, సమావేశానికి రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం సాలూర మండలంలోని ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, జిల్లా, నియోజకవర్గ ముఖ్య నాయకులు చెరుకు రైతులతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ బి గంగాశంకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ చీల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై నరేందర్‌రెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మందర్న రవి, నాగేశ్వర్‌రావు, పులి శ్రీనివాస్, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు అల్లె రమేశ్, ఖాజాపూర్ అశోక్, మూర్గె శంకర్, చిద్రపు రాములు, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల బోనాల ఊరేగింపు



బోనాలతో నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో భాగంగా మంగళవారం నగరంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. ధర్నా చౌక్ నుంచి పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపు సాగింది. ఉద్యోగినులు దేవతల వేషధారణతో ఆకట్టుకున్నారు. సమ్మెకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రఘునాథరావు మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు రాజు, గంగామణి, రవికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం



ఖలీల్‌వాడి: నిజామాబాద్–2 ఆర్టీసీ డిపోలో ఎలక్ట్రికల్ బస్సులను సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్.కరీంనగర్ జోన్ ఖుస్రో షా ఖాన్ మంగళవారం ప్రారంభించారు.ఆయనతోపాటు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న,డిప్యూటీ రీజినల్ మేనే జర్ వి శంకర్,ఎన్ సరస్వతి, డిపో మేనేజర్ ఎ న్ సాయన్న, అసిస్టెంట్ మేనేజర్ (మెకానిక్) తిరుపతి,అధికారులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా తాహెర్ ఏకగ్రీవ ఎన్నిక

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడిగా క్లబ్ సీనియర్ సభ్యులు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల ప్రధాన అధికారి కిరణ్ కుమార్ గౌడ్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు ఎర్రం విగ్నేష్, బంటు వసంత్, ఉదయ కృష్ణ, దొన్పల్ సురేష్ తెలిపారు. ఉపాధ్యక్ష పదవికి ఒక నామినేషన్ వేసిన నేపథ్యంలో నామినేషన్ పత్రాలను పరిశీలించిన అనంతరం ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఉన్నందున ఆమోదించినట్లు వారు తెలిపారు. కార్యదర్శి పదవికి భూపాల్ రెడ్డి, నర్సారెడ్డి, స్వామిదాస్ పోటీలో ఉన్నారన్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి డాకం సాయిలు, సురేష్‌గౌడ్ పోటీలో ఉన్నారని తెలిపారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణకు ఒక రోజు సమయం ఉన్నందున, నామినేషన్‌లను ఎవరైన ఉపసంహరణ చేసుకోని యెడల 29న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభం



నల్లగొండ:జిల్లా కేంద్రంలో మంగళవారం 43వ తెలంగాణ స్టేట్ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రా రంభమయ్యాయి. ఈసందర్భంగా నిర్వహించిన మార్చ్‌పాస్ట్‌లో వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా జట్టు సభ్యులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు.

150 మంది మెప్మా ఆర్పీలకు మెమోలు

నిజామాబాద్ సిటీ: మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పీ (రిసోర్స్ పర్సన్)లకు మెమోలు జారీచేయాలని సీడీఎంఏ నుంచి సర్క్యులర్ జారీచేశారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆర్‌పీలు ఈ నెల 13న 'చలో హైదరాబాద్'కు వెళ్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,895మంది ఆర్‌పీలు విధులకు గైర్హాజరయ్యారని గుర్తించి, విధులకు హాజరుకాకుండా నిరసన కార్యక్రమంలో పాల్గొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లాలోని 150 మంది ఆర్‌పీలకు మెమోలు జారీ చేయాలని మెప్మా పీడీ ఆదేశాలు జారీ చేయగా, అందులో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 65మంది ఉన్నారు. డ్యూటీలకు ఎందుకు గైర్హాజరయ్యారో తెలుపుతూ మూడు రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీచేశారు.

నాన్నను చూడాలి..

- బహ్రెయిన్‌కు వెళ్లి అక్కడ జైలు పాలైన కొడిచర్లకు చెందిన కంచు గంగయ్య
- సొంతగడ్డకు రప్పించాలని ప్రవాసీ ప్రజావాణిలో కూతురు, భార్య వినతి
- హైదరాబాద్ ఆర్‌పీవో నిర్లక్ష్యంతో గంగయ్యకు జారీకానీ అవుట్ పాస్‌పోర్టు

మోర్తాడ్(బాల్కొండ): తండ్రిని చూడాలని కూతురి ఆరాటం, తన భర్త ఎలా ఉన్నాడో అని భార్య ఉద్వేగం, పదహారేళ్ల కింద బహ్రెయిన్ వెళ్లిన కంచు గంగయ్య అక్కడ పడరాని పాట్లు పడుతుండగా అతన్ని ఇంటికి రప్పించాలని కుటుంబ సభ్యులు ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించారు. తనకు ఊహ తెలియని వయస్సులో ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన తన తండ్రి ఎలా ఉంటాడో తెలియదని అప్పుడప్పుడు ఫోన్‌లో మాట్లాడటమే తప్ప తన తండ్రిని చూసి ఎరుగనని గంగయ్య కూ తురు శృతి తీవ్ర భావోద్వేగానికి గురైన సందర్భం అందరినీ కలచివేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ని ర్వహించిన ప్రజావాణిలో నిజా మాబాద్ జిల్లా మెండోరా మండలం కొడిచెర్లకు చెందిన కంచు గంగయ్య భార్య లక్ష్మి, కూతురు శృతి వినతి పత్రం అందించారు.అ యితే గంగయ్య 16 ఏళ్లుగా బహ్రెయిన్‌లో నానా తిప్పలు పడుతూ కాలం వెళ్లదీస్తున్న సందర్భం గురించి ఆలోచిస్తే ఎవరికైనా ఒళ్లు జలదరిస్తుంది.



కంచు గంగయ్య

ఇమ్మిగ్రెంట్స్ ఫోరం ద్వారా వెలుగులోకి...

బహ్రెయిన్‌లో చట్టవిరుద్ధంగా ఉంటూ జైలు పక్షిగా మారిన గంగయ్య ఘటన ఎమిగ్రెంట్స్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి ద్వారా వెలుగులోకి వచ్చింది. బహ్రెయిన్‌లోని సామాజిక కార్యకర్త నోముల మురళి జైలులో ఉన్న గంగయ్య గురించి సమాచారం సేకరించి భీంరెడ్డికి చేరవేశారు. అతను గంగయ్య భార్య లక్ష్మిని ఫోన్‌లో సంప్రదించగా తన భర్త పదహారు సంవత్సరాలుగా ఇంటి ముఖం చూడలేదని వివరించారు. ప్రవాసీ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించాలని భీంరెడ్డి సూచించడంతో గంగయ్య కుటుంబ సభ్యులు ఈరోజు హైదరాబాద్‌కు వెళ్లారు.



ప్రవాసీ ప్రజావాణిలో వినతి పత్రం సమర్పిస్తున్న కంచు గంగయ్య కూతురు, భార్య

పట్టించుకోని అధికారులు

బహ్రెయిన్ జైలులో ఉన్న గంగయ్య ఇంటికి చేరాలంటే అతనికి అవుట్‌పాస్‌పోర్టు తప్పనిసరిగా అవసరం ఉంది. గంగయ్య ఫోటో గుర్తింపు ధ్రువీకరణ చేసి పంపిస్తేనే అవుట్‌పాస్‌పోర్టును జారీ చేస్తామని బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులు స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయానికి సమాచారం అందించారు. గంగయ్య ఫొటో ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ఇండియన్ ఎంబసీ నుంచి హైదరాబాద్ ఆర్‌పీవోకు మూడుమార్లు మెయిల్ చేసినా ఫలితం లేకపోయింది. ఇక్కడ ఆర్‌పీవోగా పని చేసే అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అవుట్‌పాస్‌పోర్టు జారీలో జాప్యం ఏర్పడింది. చివరకు గంగయ్య భార్య, కూతురు ప్రవాసీ ప్రజావాణిలో అభ్యర్థన పత్రం అందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు స్పందించి గంగయ్యను ఇంటికి రప్పించే చర్యలు వేగం చేయాలని వారు కోరుతున్నారు.

జీవితం మొత్తం గల్ఫ్‌కే అంకితం..

కంచు గంగయ్య వయస్సు ఇప్పుడు 60 ఏళ్లు అతను 2008లో బహ్రెయిన్‌కు వెళ్లాడు అప్పుడు అతని కూతురు వయస్సు ఐదేళ్లు. కూతురు పుట్టకముందే సౌది అరేబియాకు ఆరేళ్లపాటు వెళ్లిన గంగయ్య, మరో మూడేళ్లు దుబాయ్‌లో ఉపాధి పొందాడు. ఇంకా ఏదో సాధించాలనే తపనతో బహ్రెయిన్‌కు వెళ్లాడు. అంతే అక్కడే అతనికి కష్టం మొదలైంది. కంపెనీ యజమాని సరైన వేతనం ఇవ్వకపోవడంతో గంగయ్య పాస్‌పోర్టును అతని వద్దనే వదలి ఖల్లివెళ్లి (అక్రమనివాసి) కార్మికునిగా ఉన్నాడు. ఆరు నెలల కింద బహ్రెయిన్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన గంగయ్య జైలు పాలైనాడు. అతని వద్ద వీసా, పాస్‌పోర్టు ఏది లేకపోవడంతో జైలుకే పరిమితమయ్యాడు.

కన్నుమూసిన స్వతంత్ర

చికిత్స పొందుతూ శిశుగృహ శిశువు మృతి

- మతిస్థిమితం లేని యువతికి జన్మించిన బిడ్డ
- అధికారుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందంటూ ఆరోపణలు
- శిశుగృహాలో ఆశ్రయం పొందుతున్న 24 మంది పిల్లలు
- వారి ఆరోగ్య పర్యవేక్షణకు వైద్యుడిని నియమించని వైనం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం శిశుగృహకు చెందిన మూడు నెలల పాప మృతి చెందింది. శిశుగృహ అధికారుల నిర్లక్ష్యం వల్లే పాప చనిపోయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల శిశు గృహాలో ఉన్న పాప పాలు తాగకపోవడంతో సిబ్బంది ఉదయం 6 గంటలకు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పాప ఉదయం 9 గంటల ప్రాంతంలో మరణించింది. పెళ్లికాకుండానే గర్భం దాల్చిన మతిస్థిమితం లేని యువతి గత సెప్టెంబర్ 15న జీజీహెచ్‌లో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం యువతి పాపను ఆస్పత్రిలోని చెత్త బుట్టలో పారేసి వెళ్లిపోయింది. ఇది గమనించిన ఆస్పత్రిలోని పోలీసు, సెక్యూరిటీ సిబ్బంది శిశువు స్వాధీనం చేసుకుని ఆస్పత్రి అధికారులకు సమాచారం ఇచ్చారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ పాపకు స్వతంత్ర అని నామకరణం చేసి శిశుగృహ, బాలరక్షభవన్ సిబ్బందికి అందజేశారు. అప్పటి నుంచి శిశుగృహాలో ఉంటున్న స్వతంత్ర చివరికి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతూ కన్నుమూసింది. అయితే శిశువు మృతిపై అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శిశు గృహాలో మొత్తం 24 మంది పిల్లలు ఉన్నారు. అయితే వారి ఆరోగ్య పర్యవేక్షణకు పిల్లల వైద్యుడిని నియమించలేదు. ఆరేళ్లుగా పిల్లలకు ఏ అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే సిబ్బంది జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు.



చికిత్స పొందుతూ మృతి చెందిన శిశుగృహ శిశువు స్వతంత్ర

జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

- సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్ర బాలికల జట్టు

నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. జట్టులోని నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, విజయంలో కీలకంగా మారారు. జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూతావిలో ఈనెల 20నుంచి 24వరకు 37వ జాతీయ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ బాలికల జట్టు, ఆంధ్రప్రదేశ్ జట్టుపై 05–02 పరుగులతో విజయం సాధించారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శర్మద్ ఆఫీస్ సెక్రటరీ (గవర్నమెంట్ యూత్ అండ్ స్పోర్ట్స్ సర్వీసెస్ జమ్మూకాశ్మీర్), ప్రత్యేక ఆహ్వానితులు సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జనరల్ ప్రవీణ్ అనౌకర్ హాజరై, విజేతలకు ట్రోఫీ, బంగారు పతకాలు అందజేసినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. జట్టులోని క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు అభినందించారు. రాష్ట్ర జట్టులోని జిల్లా క్రీడాకారులు నిశిత, లిఖిత, వర్షిని, కీర్తన (సాంఘిక సంక్షేమ పాఠశాల సుద్దపల్లి), సంహిత (సాంఘిక సంక్షేమ పాఠశాల ధర్మారం), సౌజన్య (సాంఘిక సంక్షేమ పాఠశాల ఆర్మూర్) ఉన్నారు.



ట్రోఫీని అందుకుంటున్న తెలంగాణ రాష్ట్ర జట్టు

తొలి 'పునశ్చరణ' విజయవంతం

- తెయూలో ముగిసిన తరగతులు
- పాల్గొన్న వివిధ యూనివర్సిటీల అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): భాషలో మెళకువలపై తెలంగాణలో తొలిసారి తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన తెలుగు అధ్యాపకుల పునశ్చరణ తరగతులు మంగళవారం ముగిశాయి. తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (భారతీయ భాషా విభాగాల సంస్థ, మైసూర్), తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కొనసాగిన పునశ్చరణ తరగతులకు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ యూనివర్సిటీలకు చెందిన తెలుగు అధ్యాపకులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమానికి వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నైతిక విలువలు ఎక్కువగా బోధించే అవకాశం భాషోపాధ్యాయలకు ఉంటుందని, సాహిత్యంలో సాంస్కృతిక, సామాజిక అంశాలు వ్యక్తమవుతాయి కాబట్టి విద్యార్థుల దగ్గరికి వాటిని తీసుకువెళ్లే బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ కంపా వెంకటరామయ్య 'ఇ–తెలుగు' అనే అంశంపై ప్రసంగించారు. తెయూ రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో తెలుగు అధ్యాపకులకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ ఎస్‌వీ సుబ్రమణ్య మాధవశర్మ, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా లాంగ్వేజెస్ (మైసూర్) ప్రిన్సిపల్ సీహెచ్ రాకేష్, తెయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ ఆరతి, నిర్వాహకురాలు కరిమిండ్ల లావణ్య, తెలుగు అధ్యయనశాఖ అధ్యక్షుడు లక్ష్మణ చక్రవర్తి, సీఐఐఎల్ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వీసీ సూర్య ధనుంజయ

బోధన మెరుగు పడుతుంది



తెయూ ఏర్పడిన తర్వాత మొదటిసారి పునశ్చరణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయం. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతిలో వేగంగా మార్పు చెందుతున్న పోకడలను ఈ తరగతుల్లో తెలుసుకున్నాం.

– శ్రీనివాస్, శాఖాధిపతి సీఆర్‌రెడ్డి కాలేజ్, ఏలూరు

విషయ పరిజ్ఞానాన్ని ఇచ్చింది



తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన పునశ్చరణ తరగతులు మాకెంతో విషయ పరిజ్ఞానాన్ని ఇచ్చింది. రాష్ట్రంలో ఉన్న అధ్యాపకులు మైసూర్‌కు వెళ్లి తరగతులకు హాజరవ్వాలంటే ఇబ్బందులు ఎదురయ్యేవి.

– పద్మారాణి, అధ్యాపకులు, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజ్, మెదక్

తెలుగు భాషకు ప్రాధాన్యత



పునశ్చరణ తరగతుల్లో తెలుగు భాషా ప్రాధాన్యత, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇతర భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ మాతృభాష అయిన తెలుగుకు ప్రాధాన్యత ఉంటుంది.

– ఎం సుధాసింధు, అధ్యాపకులు, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, నిజామాబాద్

ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్ అర్బన్: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు జన్మించిన ఈ శుభ దినాన అందరికీ శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈ క్రిస్మస్ వేడుక ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం నింపాలని, ఇంటింటా ఆనందపు కాంతులు వెల్లివిరియాలని, అన్ని రంగాలలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని అభిలాషించారు.

- ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ

ఖలీల్ వాడి: ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ మంగళవారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సర కాలంలో ప్రజలందరూ వారి కుటుంబ సభ్యులతో నిండు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషలతో కాలం గడపాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడు ప్రజలు, పోలీస్ సిబ్బంది, స్నేహ పూర్వకంగా సోదరా భావముతో మెలగలని తెలిపారు.

డిజిటల్ అరెస్టులు అనేవి ఉండవు

ఖలీల్‌వాడి: ఈమధ్య కాలంలో సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు అంటూ ప్రజల ఫోన్లకు కాల్స్, మెసేజ్‌లు చేస్తూ మోసగిస్తున్నారని, అసలు డిజిటల్ అరెస్టు అనేదే లేదని అదనపు పోలీస్ కమిషనర్(అడ్మిన్) బస్వారెడ్డి తెలిపారు. నగరంలోని సీపీ కార్యాలయంలో మంగళవారం సైబర్‌క్రైమ్ సిబ్బందికి ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక వినియోగం ఎక్కువ కావడంతో సైబర్ నేరాల సంఖ్య అదే స్థాయిలో పెరిగి పోయిందన్నారు. సైబర్ క్రైమ్ సిబ్బంది గ్రామగ్రామాన ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాల కేసుల్లో పూర్తిస్థాయి ఆధారాలను సేకరించి, నేరస్థులను గుర్తించాలన్నారు. వారికి శిక్ష పడేలా చేయాలని సూచించారు. సైబర్‌క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వరరావు, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, టౌన్ సీఐ శ్రీనివాస్ రాజ్, డిచ్‌పల్లి సీఐ మల్లేష్, సైబర్ పోలీస్ స్టేషన్ సీఐ ముకీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక ప్రక్రియ సక్రమమేనా?

- కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం పోస్టుల భర్తీ ప్రకియ వేగవంతం
- ఆయూష్ వైద్యులకు బాధ్యతలు
- కనిపించని రోస్టర్ ఫైల్

నిజామాబాద్‌అర్బన్: జిల్లా వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేపడుతున్న నియామకాలపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 30 కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు, మూడు ఏఎన్ఎం పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు గతేడాది నోటిఫికేషన్ జారీ చేశారు. స్టాఫ్‌నర్స్ పోస్టులకు 876, ఏఎన్ఎం పోస్టులకు 323 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పోస్టుల భర్తీ ప్రక్రియ ఆలస్యం కాగా, ప్రస్తుత డీఎంహెచ్‌వో వేగవంతం చేశారు. అయితే పరిపాలన అనుభవం ఉన్న అధికారులు, సీనియర్ ఉద్యోగులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఎంపిక ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, ఆయూష్ వైద్యులకు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోస్టుల భర్తీ ఇప్పటికే ఆలస్యం కాగా, ఇప్పుడు సంబంధం లేని వ్యక్తులకు బాధ్యతలు అప్పగించారని పలువురు అంటున్నారు.

గతంలో పోస్టుల భర్తీ ప్రక్రియను అనుసరించి రోస్టర్ రిజర్వేషన్ విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఇది వరకే పనిచేసిన అభ్యర్థులకు అదనపు మార్కులు కేటాయించాల్సి ఉంటుంది. ఇటువంటి అంశాలను పరిశీలిస్తూ నియామక ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాల్సి ఉంటుంది. ఇందు కోసం పరిపాలన విభాగంలో పని చేసే ఉద్యోగులతో నియామక ప్రక్రియను చేపట్టాల్సి ఉండగా, ఆయూష్ విభాగానికి చెందిన కొందరు వైద్యులకు అప్పజెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై మొదటి నుంచి అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఈ తరుణంలో ఆయూష్ వైద్యులతో నియామక ప్రక్రియ చేపట్టడం మరింత ఆందోళన కలిగిస్తోందని కొందరు అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఎంపిక ప్రక్రియకు సంబంధించి వైద్య శాఖలో ప్రత్యేక గదిని కేటాయించారు. ఇందులో కేవలం ఆయూష్ విభాగానికి చెందిన వైద్యులు మాత్రమే నిత్యం పరిశీలన చేస్తున్నారు. అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన చేసి ప్రక్రియను చేపడుతున్నారు. పరిపాలన విభాగానికి చెందిన ఏ ఒక్కరికి అవకాశం ఇవ్వడం లేదు.

రహస్యంగా విచారణ

వైద్యారోగ్యశాఖ నియామకాలకు సంబంధించిన రిజర్వేషన్ రోస్టర్ ఫైల్ కనిపించకుండా పోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫైల్ లేకుండా ప్రస్తుతం ఎంపిక ప్రక్రియ చేపట్టడం సాధ్యం కాదు. గత నియామకాలకు సంబంధించిన రోస్టర్ ఫైల్ అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం ఎంపిక ఎలా చేస్తారని శాఖ ఉద్యోగులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఫైల్ మాయంపై రహస్యంగా విచారణ జరుపుతున్నారు.



పకడ్బందీగా చేపడతాం

ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా చేపడతాం. ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా అర్హులైన వారిని మాత్రమే ఎంపిక చేస్తాం. దీనికి సంబంధించి ప్రత్యేక అధికారులతో నియామక ప్రక్రియను చేపడుతున్నాం. ఇందులో ఎలాంటి తప్పిదాలు లేవు. త్వరలోనే ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తాం. అర్హులైన వారికి ఉద్యోగాలు ఇస్తాం.

– రాజశ్రీ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పలువురు వేర్వేరు కారణాలతో ఆత్మహత్య చేసుకున్నారు. మద్యానికి బానిసై ఇద్దరు, అప్పుల బాధతో ఒకరు, వ్యక్తిగత కారణాలతో ఒకరు, అనారోగ్య సమస్యలతో ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు.

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని అవుసులకుంట తండాకు చెందిన గిరిజన యువతి గుగులోత్ సురేఖ(22) సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తండావాసులు తెలిపారు. యువతి ఉన్నత చదువులు చదివి హైదరాబాద్‌లో ఉంటూ వివిధ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. వారం క్రితం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలకు సైతం హాజరైనట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఎంతో భవిష్యత్ ఉన్న యువతి ఆత్మహత్య చేసుకోవడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.




సురేఖ (ఫైల్)

లింగంపేట మండలంలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మోతె గ్రామానికి చెందిన లాల్‌సారి కిష్టయ్య(46) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ మంగళవారం తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఈక్రమంలో మంగళవారం ఉదయం తన సొంత ఇంట్లో కిష్టయ్య ఉరేసుకొని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మాక్లూర్ మండలంలో..

మాక్లూర్: మండలంలోని మాణిక్‌బండార్ గ్రామానికి చెందిన నీలం రాజు (26) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. వివరాలు ఇలా.. నీలం రాజు కొంత కాలంగా ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ నెల 23న ఒంటిపై ఉన్న బంగారు నగలు ఇవ్వాలని భార్య రేఖతో గొడవ పడ్డాడు. ఆమె నిరాకరించడంతో అదేరోజు తన బైక్‌పై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మంగళవారం దాస్‌నగర్ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఉండటంతో పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రేఖ ఫిర్యాదు మేరకు పంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




రాజు (ఫైల్)

నగరంలో..

ఖలీల్ వాడి: నగరంలోని నాగారం రాజీవ్ గృహకల్పకు చెందిన సావ భరత్ (28) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా..భరత్ లేబర్ పని చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. మద్యానికి బానిస కావడంతోపాటు అప్పులపాలు కావడంతో మద్యంమత్తులో జీవితంపై విరక్తిచెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీర్కూర్‌లో..

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన హరీష్(19) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ముందురోజు మద్యం తాగి, మద్యానికి బానిసై మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని పంచనామ చేశారు.



హరీష్ (ఫైల్)

మేకల మందపై చిరుత దాడి

నందిపేట్ (ఆర్మూర్): మండలంలోని సీహెచ్ కొండూరు గ్రామ శివారులో మేకల మందపై చిరుతపులి దాడి చేసినట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం మాయాపూర్ శివారు ప్రాంతంలో పులి కనిపించినట్లు కలకలం రేపింది. ఈ విషయమై అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పులి కాదని అటవీ పిల్లి అని నిర్ధారించారు. కానీ మంగళవారం గ్రామానికి చెందిన మేకల కాపరి పోతన్న తన మేకలను తీసుకొని గ్రామ శివారులోని గుట్ట వద్దకు తీసుకొని, తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్లే సమయంలో అకస్మాత్తుగా చిరుత దాడి చేసి మందలోని మేకను చంపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

చోరీ కేసులో రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో ఇటీవల చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని నల్లమడుగు గ్రామంలో ఈనెల 18న తాళం వేసిన అబ్దుల్ రహీం ఇంట్లోకి నిందితుడు చొరబడి రూ. 95వేలు నగదు, వెండి 50 తులాలు, బంగారు ఆభరణాలు, మొత్తం రూ. 4లక్షల వరకు అపహరించాడు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వేలిముద్ర ఆధారంగా నిందితుడు గాంధారికి చెందిన ర్యాపని ఒడ్డె సాయిలుగా గుర్తించి, పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతడి నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి/నవీపేట: నగరంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష ఖరారైనట్లు మూడో టౌన్, ఐదో టౌన్ ఎస్సైలు హరిబాబు, గంగాధర్ మంగళవారం తెలిపారు. షేక్ అశ్రాఫ్, కట్ట నరేందర్(40) మద్యం తాగి, వాహనం నడుపుతుండగా, వారిని పట్టుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. వారికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు వారు తెలిపారు.

అలాగే నవీపేట మండలం యంచ గ్రామానికి చెందిన కొత్తపల్లి శ్రీకాంత్ డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా కోర్టు అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- 22న నవోదయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- పాల్గొని వెళ్తుండగా రోడ్డు ప్రమాదం..
- ఒకరు అక్కడికక్కడే మృతి
- మరొకరు చికిత్స పొందుతూ మృత్యువాత



వెంకటరమణారెడ్డి (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్‌లోని నవోదయ విద్యాలయంలో మూడు రోజుల క్రితం జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆనందంగా పాల్గొని తిరుగు ప్రయాణమైన ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఈ ఘటన రెండు కుటుంబాలలో విషాదాన్ని నింపింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్ మాజీ సర్పంచ్ ఆడుపల్లి విజయ శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు వెంకటరమణారెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడు పాఠశాల విద్య నిజాంసాగర్‌ నవోదయ విద్యాలయంలో అభ్యసించడంతో ఈనెల 22న పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనానికి హాజరై, అదేరోజు హైదరాబాద్‌కు వెళ్లాడు. అనంతరం అక్కడి నుంచి మరో పూర్వ విద్యార్థిని దోమకొండకు చెందిన శివానితో కలిసి బైక్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో శివాని అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటరమణారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సా ఫ్ట్‌వేర్ ఉద్యోగంతో స్థిరపడ్డానని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తానని వెంకటరమణారెడ్డి స్నేహితులతో చెప్పినట్లు తెలిసింది. కానీ అతడు మృతిచెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఆర్మూర్‌లో దొంగల అలజడి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని విష్ణు అపార్ట్‌మెంట్, మహాలక్ష్మీ కాలనీలోని వైష్ణవి అపార్ట్‌మెంట్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు అలజడి సృష్టించారు. ముఖానికి ముసుగు ధరించిన ముగ్గు రు దొంగలు అపార్ట్‌మెంట్‌లోనికి ప్రవేశించి చోరీకి యత్నించారు. అపార్ట్‌మెంట్‌లో తిరుగుతూ రెక్కి నిర్వహించారు. ఈ దృశ్యాలను సీసీ కెమెరాలో అపార్ట్‌మెంట్ వాసులు గుర్తించారు. ఎటువంటి వస్తువులు చోరీకి గురికాకపోవడంతో వారు ఊపిరి పీ ల్చుకున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.